# మారణకాండలో విరిసిన మానవత్వం

*- గబ్బిట కృష్ణమోహన్*

సెప్టెంబర్ పదకొండవ తేది, 2001 సంవత్సరం, (9/11) నాడు అమెరికాలో జరిగిన మారణహోమం తరవాత డెల్టా 15 విమాన సిబ్బందికి చెందిన ఫ్లైట్ అటెండెంట్ రాసిన అత్యద్భుత ఉదంతం.

సెప్టెంబరు 11, మంగళవారం నాటి పొద్దున మా విమానం ఫ్రాంక్‌ఫర్ట్ విడిచి అయిదు గంటలు దాటి ప్రస్తుతం ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ప్రయాణిస్తోంది. అకస్మాత్తుగా కర్టెన్లు తెరుచుకోవడం నన్ను కాక్‌పిట్‌లోకి వెళ్లి కెప్టెన్‌ని కలవమనడం జరిగింది. వెంటనే నేను లోపలికి వెళ్ళి చూసేసరికి సిబ్బంది ముఖాలు ఎప్పటిలో పనిలో నిమగ్నమైనట్టు వున్నాయి. నన్ను చూడగానే కెప్టెన్ నా చేతిలో ఒక ప్రింటెడ్ సందేశం వుంచాడు. అట్లాంటాలోని డెల్టా మెయిన్ ఆఫీసునుంచి వచ్చిందది. "అమెరికాలో వాణిజ్య విమానాల రాకపోకలు నిషేధించారు. వీలైనంత త్వరలో దగ్గరి విమానాశ్రయంలో దిగాలి. ఎక్కడ దిగింది తెలపాలి."

దీని అర్థం ఎవరూ విడమర్చి చెప్పలేదు. పరిస్థితి గంభీరం కనక వెంటనే దిగాలి. మాకు దాపులో వున్న విమానాశ్రయం 400 మైళ్ళు వెనకగా న్యూఫౌండ్‌ల్యాండ్‌లో వున్న గ్యాండర్ అని కెప్టెన్ ధ్రువీకరించాడు. మార్గ మళ్ళింపుకు కెనడియన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌ని అడిగిందే తడవు వెంటనే అనుమతి లభించింది. ఎలాంటి ప్రశ్నలు లేకుండా అంత త్వరగా ఎలా ఆమోదించారన్న దానికి సమాధానం తరవాత వెల్లడైంది. వైమానిక సిబ్బంది నేలమీదికి దిగడానికి సన్నాహాలు చేస్తుండగా న్యూయార్క్ ప్రాంతంలో టెర్రరిస్టుల కార్యకలాపాలు జరుగుతున్నాయని డెల్టా నుంచి సమాచారం వచ్చింది. విమానాలు హైజాకింగులకి గురి అయినట్టు మరికొన్ని నిమిషాల తరవాత తెలిసింది.

ప్రయాణికులకి నిజం చెప్పకూడదని విమానం ఎగురుతున్నప్పుడే నిశ్చయించాము. విమానంలో ఇన్స్ట్రుమెంట్ ప్రాబ్లం వచ్చిన దృష్ట్యా దగ్గర్లో న్యూఫౌండ్ ల్యాండ్‌లో వున్న గ్యాండర్ విమానాశ్రయంలో దిగి తనిఖీ చేయించాలని చెప్పాం. గ్యాండర్‌లో దిగిన తరవాత మరింత సమాచారం యివ్వగలమన్నాం. ప్రయాణీకుల్లో కలకలం చెలరేగింది. అయితే అది మాకు కొత్తకాదు! 40 నిమిషాల తరవాత మా విమానం గ్యాండర్‌లో దిగింది. అప్పుడు అక్కడి టైము మధ్యాహ్నం పన్నెండున్నర. అంటే న్యూయార్కులో సమయం పొద్దున పదకొండు గంటలు.

అమెరికా వెడుతూ అలా దారి మళ్ళింపుకు గురి అయి వివిధ దేశాలకి చెందిన విమానాలు అప్పటికే యిరవైకి పైగా దిగి వున్నాయక్కడ. విమానం నేలకి దిగిన తరవాత మా కెప్టెన్ యిలా ప్రకటించాడు: "లేడీస్ అండ్ జెంటిల్‌మెన్, మన చుట్టూ వున్న విమానాలను చూసి అన్నిటికీ ఒకే తరహా సాంకేతిక లోపం వచ్చిందా అని మీరు ఆశ్చర్యపడుతుండవచ్చు. మనం వేరే కారణం వల్ల ఇక్కడ దిగాల్సి వచ్చింది" అని చెప్పి, అమెరికాలో జరిగిందాన్ని గురించి అంతో ఇంతో తెలిసిన సమాచారం ఇచ్చాడు. విమానమంతా గట్టిగా అరుపులు, నమ్మలేనట్టు చూస్తున్న చూపులు.

మా బాధ్యత కెనడా ప్రభుత్వం తీసుకుంది. విమానం దిగడానికి ఎవరికీ అనుమతి లేదు. అలాగే బయటివాళ్ళు విమానాల దగ్గరకి రావడం కూడా నిషేధం. కెనడాకి చెందిన పోలీసు బలగం అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని చూసి మరో విమానం వైపుకి కదలడం మాత్రం జరిగింది. ఇంకో గంటలో మరిన్ని విమానాలు దిగడంతో గ్యాండర్ విమానాశ్రయంలో ప్రపంచంలోని నలుమూలల నించి వచ్చి చేరిన వాణిజ్య విమానాల సంఖ్య 53 కు చేరుకుంది. అందులో 27 అమెరికాకు చెందినవి.

ఈ లోపల మా విమానంలో వున్న రేడియో సెట్టు ద్వారా మరికొంత సమాచారం మొట్టమొదటిసారి లభించింది – న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోకి, డి.సి.లో వున్న పెంటగన్ లోకి హైజాక్ చేసిన విమానాలు చొచ్చుకొని వెళ్ళాయి. కెనడాలో సెల్ సిస్టమ్ వేరే అయినందువల్ల సెల్‌ఫోన్లు వాడటానికి ప్రయాణీకులు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. కొంతమందికి కనెక్షన్ దొరికినా అమెరికాలో లైన్లన్నీ జామయినట్టో, బ్లాక్ చేసినట్టో కెనడా ఆపరేటర్ నుంచి సమాచారం వచ్చింది.

వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలు కుప్పకూలాయని హైజాక్ చేసిన నాలుగవ విమానం కూలిపోయిందన్న సమాచారం ఎప్పుడో సాయంత్రానికి తెలిసింది. అప్పటికే ప్రయాణీకులు భయభ్రాంతులకి లోనవడమేకాక మానసికంగా, శారీరకంగా కుంగిపోయున్నారు – అయినా అందరూ ప్రశాంతంగా వుండటం చూసి ఆశ్చర్యమేసింది. అటువంటి స్థితిలో వున్నది మేమొక్కరమే కాదు, కిటికీలోంచి బయటికి చూస్తే మరో 52 విమానాల్లో వున్న ప్రయాణీకుల స్థితి కూడా అదేనని అందరం గుర్తించాం.

ఒక్కొక్క విమానం నుంచి దశలవారీగా బయటికి దిగే అవకాశం ఇస్తామని ముందుగానే చెప్పారు. మా వంతు మర్నాడు ఉదయం పదకొండు గంటలకి అని గ్యాండర్ విమానాశ్రయం నుంచి సాయంత్రం ఆరు గంటలకి సమాచారం అందింది. దానితో ప్రయాణీకులు తృప్తిపడలేదు. చేసేదేమీ లేకపోవడంతో ఆ సమాచారాన్ని దిగమింగి రాత్రంతా విమానంలోనే గడపడానికి సన్నద్ధమయ్యారు. అవసరానికి వైద్య సదుపాయం, తాగేందుకు నీరు, టాయిలెట్ల శుభ్రత సమకూర్చడానికి గ్యాండర్ విమానాశ్రయ అధికారులు మాట ఇచ్చారు. మాటప్రకారం నడుచుకున్నారు కూడా. అదృష్టవశాత్తు వైద్యసహాయం అవసరం లేకపోయింది. అయితే 33 వారాల గర్భంతో వున్న పడుచు స్త్రీ ఒకామె వుంది. నిజంగా ఆమెను మేము చాలా బాగా చూసుకున్నామని చెప్పాలి. సీట్లలో పడుకోడానికి కొంత ఇబ్బందిగానే వున్నా ఎలాంటి సంఘటనలు లేకుండా ఆ రాత్రి గడిచింది.

పన్నెండవ తేదీ పొద్దున సుమారు పదిన్నర గంటలకి స్కూలు బస్సుల సమూహమొకటి వచ్చి చేరింది. మేమందరం విమానం దిగి టెర్మినల్‌లోకి ప్రవేశించాం. ఇమిగ్రేషన్, కస్టమ్స్ తనిఖీలు ముగిసిన తరవాత రెడ్‌క్రాస్ వారు మా వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆ తరవాత మమ్మల్ని, అంటే సిబ్బందిని, ప్రయాణీకుల్నించి వేరుచేసి వ్యాన్‌లో హోటల్‌కి తీసుకెళ్ళారు. ప్రయాణీకులంతా ఎక్కడికి వెడుతున్నారో అప్పుడు మాకు తెలియలేదు. ప్రపంచం నలుమూలలనుంచి పలు విమానాల్లో దిగిన ప్రయాణీకుల సంఖ్య 10,500 అని, 10,400 మంది వున్న గ్యాండర్ పట్టణ జనాభా వారందరి బాగోగుల్ని చూసుకోవాలని రెడ్‌క్రాస్ వారి ద్వారా తెలిసింది.

సిబ్బందిని మాత్రం హోటలుకి వెళ్ళి విశ్రాంతి తీసుకోమని చెప్పి అమెరికా విమానాశ్రయాలు రాకపోకలకి తెరవగానే సమాచారం అందిస్తాము. అయితే అది అంత శీఘ్రంగా జరుగుతుందని అనుకోవద్దు అంటూ హెచ్చరించాడు కూడా. అమెరికాలో జరిగిన విధ్వంసకాండ గురించిన పూర్తి వివరాలు 24 గంటల తరవాత, హోటల్లో వున్న టీ.వీ.లో చూసి తెలుసుకున్నాము.

గడిపేందుకు సమయం చాలా వుండటంతో అటూ ఇటూ తిరుగుతూ గ్యాండర్‌లో స్థానికులు చాలా స్నేహ పూర్వకమని గుర్తించాం. మమ్మల్ని "విమానం వాళ్ళు" అని సంబోధించారు. వారి ఆతిథ్యం అనుభవిస్తూ గ్యాండర్ పట్టణం చుడుతూ చక్కగా కాలక్షేపం చేశాము.

రెండు రోజుల తరవాత పిలుపు వచ్చింది. మమ్మల్ని గ్యాండర్ విమానాశ్రయానికి తీసుకెళ్ళారు. ప్రయాణీకులంతా మళ్ళీ విమానంలో కలిశాక రెండు రోజుల పాటు వాళ్లందరూ ఏం చేసింది ఎలా గడిపిందీ తెలుసుకున్నాం. వాళ్ళు చెప్పిందంతా విని సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయాం.

గ్యాండర్‌తోపాటు దాని చుట్టుపక్కల 75 మైళ్ళ పరిధిలో వున్న వూళ్ళలో హైస్కూళ్ళు, మీటింగు హాల్సు, లాడ్జిలు, మరితర కూడళ్ళు మూసివేసి వాటిని యిలా ఆగిపోయిన ప్రయాణీకుల బస కోసం వినియోగించారు. కొన్నిచోట్ల మంచాలు, మరికొన్ని చోట్ల చాపలు వేసి స్లీపింగ్ బ్యాగ్సు, తలగడలు ఏర్పాటు చేశారు. "అతిథుల" బాగోగులు చూసుకోడానికి హైస్కూలు విద్యార్థుల్ని స్వచ్ఛంద సేవకి నియమించారు.

మా విమానానికి చెందిన 218 మంది ప్రయాణీకుల బస – గ్యాండర్‌కు 45 కిలోమీటర్ల దూరంలో

లూయిస్‌పోర్ట్ అన్న వూరి హైస్కూలులో. స్త్రీలెవరైనా ఆడవారికి ప్రత్యేకంగా కేటాయించిన వసతిలో బస చెయ్యదలచుకుంటే అదీ ఏర్పాటు చేశారు. ఒకే కుటుంబానికి చెందినవారందరినీ ఒక్కచోటే వుంచారు. వయసు మళ్ళిన వారిని స్వంత ఇళ్ళకి తీసుకెళ్ళారు.

మా ప్రయాణీకుల్లో వున్న గర్భిణీ స్త్రీ గుర్తుందా? 24 గంటలూ అర్జెంట్ కేర్ సదుపాయం వున్న హాస్పిటలుకి రోడ్డుకి ఆవైపునున్న ఇంట్లో వుంచారు. పిలవగానే పలికే డెంటిస్టుతోపాటు ఆడ నర్సులు, మగ నర్సులు ఆ రెండు రోజులూ వీరితోనే వున్నారు.

అమెరికాతోపాటు ప్రపంచంలో అన్ని ప్రదేశాలకీ ఫోన్‌కాల్సు, ఇ-మెయిలు సదుపాయాలు అందరికీ రోజుకోసారి చొప్పున అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణీకులందరికీ పగటిపూట విహారయాత్రలు ఏర్పాటు చేశారు. కొంతమంది అక్కడున్న సరస్సుల్లోనూ, హార్బర్లలోనూ నౌకా విహారం చేస్తూ, మరికొంతమంది చుట్టుపక్కలున్న అడవులు గాలించి వచ్చారు.

అతిథుల కోసం బ్రెడ్ తయారు చేసేందుకు వూళ్ళో బేకరీలన్నిటినీ రాత్రింబవళ్ళు తెరిచి వుంచారు. వూరి ప్రజలంతా భోజనం ఇంట్లోనే తయారు చేసి స్కూలుకి తెచ్చారు. కొంతమందిని కోరుకున్న హోటళ్ళకి తమ కార్లలో తీసుకెళ్ళి చక్కటి భోజనం అందించారు. ప్రయాణీకుల సామానంతా విమానంలోనే వుండిపోవడం మూలాన బట్టలు ఉతుక్కునేందుకు అక్కడి లాండ్రీ మ్యాట్స్‌కు టోకెన్లు ఇచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆగిపోయిన ప్రయాణీకుల ప్రతి అవసరమూ అలా వాళ్ళు తీర్చారు. ఈ విషయాలన్నీ వివరిస్తుంటే ప్రయాణీకుల కళ్ళల్లోంచి ధారాపాతంగా నీళ్ళు కారాయి.

ఎట్టకేలకి వాణిజ్య విమానాల రాకపోకలకి అమెరికాలో విమానాశ్రయాలు తెరిచారన్న విషయం తెలియగానే - ఒక్క ప్రయాణీకుడినీ విడిచిపెట్టకుండా, ఆలస్యం కాకుండా సమయానికి అందర్నీ విమానాశ్రయానికి తీసుకొచ్చి దిగబెట్టారు. ఏ ప్రయాణీకుడు ఎక్కడున్నది, ఏ విమానం ఎక్కవలసింది, ఆ విమానం బయలుదేరే సమయం భోగట్టా అంతా రెడ్‌క్రాస్ వారి వద్ద వుంది. ఆ సంస్థ సహకారం చాలా గొప్పది.

వింటుంటే అంతా నమ్మశక్యం కాకుండా వుంది.

అలా కలసికట్టుగా విమానం ఎక్కిన ప్రయాణీకులు సరదా ప్రయాణం చేసొచ్చిన వారిలా కనబడ్డారు. అందరికీ అందరి పేర్లూ పరిచయమయ్యాయి. వాళ్ళు ఎలా గడిపిందీ కథలు కథలుగా వర్ణిస్తుంటే ఒకర్నిమించి ఒకరు మరింత ఆనందంగా గడిపినట్టు తెలిపారు. తిరిగి అట్లాంటాకు బయల్దేరుతున్న మా విమానం ఇప్పుడు ఏదో బృందంగా ఏర్పడి కుదుర్చుకున్న ఛార్టర్డ్ ఫ్లైటులా కనబడింది. దాంతో మా సిబ్బంది వారికి దూరంగా వుండిపోయింది.

మనసుకి అందని అద్భుతం.

ఎట్టకేలకి వాణిజ్య విమానాల రాకపోకలకి అమెరికాలో విమానాశ్రయాలు తెరిచారన్న విషయం తెలియగానే - ఒక్క ప్రయాణీకుడినీ విడిచిపెట్టకుండా, ఆలస్యం కాకుండా సమయానికి అందర్నీ విమానాశ్రయానికి తీసుకొచ్చి దిగబెట్టారు. ఏ ప్రయాణీకుడు ఎక్కడున్నది, ఏ విమానం ఎక్కవలసింది, ఆ విమానం బయలుదేరే సమయం భోగట్టా అంతా రెడ్‌క్రాస్ వారి వద్ద వుంది.

ప్రయాణీకులందరూ అలా కలసి మెలసిపోయి ఒకర్నొకరు ఇంటి పేరుతో కాక అసలు పేరుతో పిలుచుకుంటూ ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు, ఇ-మెయిల్ అడ్రస్‌లు ఇచ్చి పుచ్చుకున్నారు.

ఆ తరవాత అనూహ్యమైన సంఘటన ఒకటి జరిగింది.

ఒక ప్రయాణీకుడు ముందుకొచ్చి అందర్నీ మైకులో సంబోధిస్తానన్న కోరిక వెళ్ళబుస్తూ నా అనుమతి అడిగాడు. మామూలు పరిస్థితుల్లో అలాంటివాటికి అనుమతి వుండనే వుండదు. అయితే ఇప్పటి ప్రత్యేక పరిస్థితిలో "అఫ్‌కోర్స్, తప్పకుండా" అంటూ మైకు అతనికి అందించాను.

ఆయన మైకులో గత రెండు రోజుల అనుభవాల్ని అందరికీ గుర్తుచేస్తూ పూర్తి అపరిచితుల ఆతిథ్యం ఎంత గొప్పగా వున్నదీ స్ఫురణకు తెచ్చాడు. లూయిస్‌పోర్ట్ ప్రజల అభిమానానికి కృతజ్ఞతతో బదులుగా ఏదైనా చేయాలని తలపెట్టానన్నాడు. డెల్టా 15 (అది మా ఫ్లైట్ నెంబరు) పేరుతో ఒక ట్రస్ట్ ఫండు ఏర్పాటు చేస్తానన్నాడు. ఆ మొత్తం లూయిస్‌పోర్ట్‌లోని పిల్లల కాలేజి చదువు కోసం ఆర్థిక సహాయం అందించేందుకన్నాడు. ప్రయాణీకులందర్నీ చేతనయినంత విరాళం ఇమ్మని అర్థించాడు. కాసేపటికి విరాళాల వివరాలతోపాటు వారి ఫోన్ నెంబర్లు, అడ్రసులతో

కూడిన జాబితా మాకు అందింది. ఆ మొత్తం 14 వేల డాలర్ల పైబడి వుంది. వర్జీనియాకి చెందిన ఆ పెద్దమనిషి, ఎమ్.డి., ఆ మొత్తానికి అంత మొత్తం తను చేర్చి స్కాలర్‌షిప్పుల వితరణ కోసం అవసరమైన యంత్రాంగాన్నీ ఏర్పాటు చేస్తానన్నాడు. ఈ ప్రతిపాదనని డెల్టా యాజమాన్యానికి కూడా తెలిపి వారిని కూడా విరాళం అడుగుతానన్నాడు.

నేను ఈ వృత్తాంతం రాసే సమయానికి ఆ ట్రస్టు ఫండు ఒకటిన్నర మిలియన్ డాలర్లకు పైగా వుండి 134 మంది విద్యార్థుల కాలేజీ చదువులకు సాయమందించింది.

ఈ కథ మీతో పంచుకోవడంలో ముఖ్య వుద్దేశ్యం మనకిప్పుడు మంచి కథలు కావాలి కనక.

ఎక్కడో దూరప్రాంతానున్న ప్రజలు అకస్మాత్తుగా ఆకాశాన్నించి వూడిపడ్డ (నిజం కూడా అదే!) వారికి చూపించిన దయాగుణం గుర్తించినందుకు.

ప్రపంచంలో ఎంత మంచితనం వుందో స్మరణకి వచ్చి ఆశావహంతో వున్నందుకు.

మన చుట్టూ ఎన్నో నీచాతి నీచమైన వ్యవహారాలు జరుగుతున్నా ఈ రోజుల్లో ప్రపంచంలో మంచివారు యింకా చాలామంది వున్నారని, పరిస్థితులు అనుకూలించని సమయంలో ఆదుకునేందుకు వారు ముందుకొస్తారని తెలిసినందుకు.

నలుగురితో పంచుకోవాల్సిన కథల్లో యిది ఒకటి... దయచేసి ఆ పని చెయ్యండి.

2011, సెప్టెబర్ 11వ తేది. మారణహోమం జరిగి పది సంవత్సరాలు అయిన సందర్భంలో గ్యాండర్ పట్టణ మేయరుని, మరితర అధికారులని అమెరికాకు ఆహ్వానించి కృతజ్ఞతలు తెలిపి ప్రశంసించిన సందర్భంలో మేయర్ ఎలియట్, సెప్టెంబరు 11, 2001న జరిగిన సంఘటన ప్రపంచాన్ని పూర్తిగా మార్చివేసింది కానీ, గ్యాండర్‌తోపాటు చుట్టుపక్కల వున్న పౌరుల నడవడి మీద దాని ప్రభావం చూపలేదు. గ్యాండర్ పుర ప్రజలు ప్రక్క దేశానికి అందించిన సహాయ సహకారాలు గుర్తింపు పొందడానికో లేక బహుమతులు అందుకోడానికో కాదు, కేవలం "మేము మానవులం" కనక అని చెప్పాడు. అదే సందర్భంలో ప్రెసిడెంట్ ఒబామా కెనడా ప్రధానమంత్రి స్టీఫెన్ హార్పర్‌కు రాసిన లేఖలో సెప్టెంబరు 11, 2001 న జరిగిన దారుణ సంఘటన సమయంలో కెనడా దేశపు పౌరులు ఆ రోజున, ఆ తరువాతి రోజుల్లో చక్కటి స్నేహసౌభ్రాతృత్వం ప్రదర్శిస్తూ అసాధారణ సేవలందించారు. విమానాశ్రయాలే కాక వారి గృహాలని, హృదయ కవాటాలని తెరిచి వుంచారు. దానికి మేమంతా ఎప్పటికీ కృతజ్ఞులం అని వుల్లేఖించాడు.

సమాధానంగా కెనడా ప్రధానమంత్రి, సరిగ్గా పది సంవత్సరాల కిందట జరిగిన దానికి మీకు, అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలకు నా తరఫున, మా దేశ ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతి. కెనడా. అమెరికాల మధ్య వున్న స్నేహం గాఢం, మీరు చెప్పినట్టు గ్యాండర్‌తోపాటు కెనడాలోని అన్ని ప్రాంతాల సాధారణ పౌరులు తమ గృహాలని, హృదయాలని మార్గ మళ్ళింపుకు గురి అయిన ప్రయాణీకులకి తెరిచి వుంచి ఆ స్నేహాన్ని మరింత దృఢపరిచారు అని రాశాడు.

అమెరికా రాయబారి డేవిడ్ జాకబ్‌సన్ గ్యాండర్ పట్టణం సందర్శించి అక్కడి హాకీ మైదానంలో పురప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి సహకారాన్ని డగ్గుత్తికతో ప్రశంసించాడు. న్యూయార్క్ అగ్నిమాపక సిబ్బందిలో ఒకరు వరల్డ్ ట్రేడ్ సెంటర్ శిధిలావశేషాల్లోంచి తీసిన రెండు ఉక్కు దూలాలు (గర్డర్స్) అక్కడి ప్రజలకి జ్ఞాపకార్థంగా పంపితే దాన్ని వైమానిక మ్యూజియంలో భద్రపరిచారు.

ఆ తరవాత మేయర్ ఎలియట్ మాట్లాడుతూ, ఆ రోజున "మాకు అలా చేయాలనిపించింది, చేశాము. తిరిగి వెడుతున్న ప్రయాణీకుల ముఖాల్లో వెల్లివిరిసిన దరహాసాలే మాకు చాలు" అని చెప్పి, "మన కోసం మనమేం చేస్తామో అది మనతోనే చనిపోతుంది, కాని, యితరుల కోసం చేసినది చిరకాలం నిలుస్తుంది" అంటూ ముగించాడు.

డెల్టా 15కి చెందిన ఫ్లైట్ అటెండెంట్ నజీమ్‌తోపాటు మరికొన్ని విమానాలకి చెందినవారు రాసిన వుదంతాలు అంతర్జాలంలో లభిస్తాయి.

ఆ మధ్య మిత్రులు ఫేస్‌బుక్‌లో వుంచిన ఈ వుదంతం చదివి, మరికొంతమందికి తెలపాలన్న వుద్దేశ్యంతో చేసిన తెలుగుసేత.

గబ్బిట కృష్ణమోహన్
హైదరాబాదు